క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: వేసవిలో బాటసారుల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. మహాత్మా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జాగారపు శ్రీను ఆధ్వర్యంలో దల్లి వానిపాలెం జంక్షన్‌లో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, దల్లి పైడికొండ, రాఘవరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ సిబ్బందికి సత్కారం



యూపీహెచ్‌సీ సిబ్బందిని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

పెదగంట్యాడ: సంజీవ కాలనీ యూపీహెచ్‌సీ సిబ్బందిని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలు అందించారని బ్రహ్మకుమారీస్ గాజువాక ఇన్‌చార్జి బీకే మణి కొనియాడారు. మణి మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది మానసిక ఒత్తిడి నుంచి దూరం కావాలంటే ధ్యానం చేయాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చక్రధర్‌తో పాటు ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణను, ఆరోగ్య సిబ్బందిని సత్కరించారు. వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

గంగా పుష్కర నిర్వహణ కమిటీలో నర్సింగరావు



గాజువాక: వారణాసిలో నిర్వహించనున్న గంగా పుష్కరాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఏర్పాటు చేసిన నిర్వహణ కమిటీ కో–ఆర్డినేటర్‌గా గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు నియమితులయ్యారు. సహాయ కో–ఆర్డినేటర్లుగా ఇదే ప్రాంతానికి చెందిన గూటూరు శంకరరావు, పి.నాగేశ్వరరావు, వంశీయాదవ్, కె.సుబ్రహ్మణ్యంలను నియమించినట్టు నర్సింగరావు తెలిపారు. గంగా పుష్కరాల కోసం వారణాసికి చేరుకొనే తెలుగు యాత్రికుల సహాయార్థం తమ కమిటీ పని చేస్తుందన్నారు. ఈ బాధ్యతలను అప్పగించిన ఎంపీ జీవీఎల్ నర్సింహారావుకు ధన్యవాదాలు తెలిపారు.

నిరుపేదలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నరసింగరావు

అగనంపూడి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవం సందర్భంగా అగనంపూడి టీడీపీ మాజీ అధ్యక్షుడు మామిడి నరసింగరావు ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హర్షవర్ధన్, పొండ్రంగి జయరాజు, నెల్లి శ్రీనివాసరావు, బంధం అప్పలరాజు పాల్గొన్నారు. 85వ వార్డులో టీడీపీ అధ్యక్షుడు కర్రి దేవేంద్ర ఆధ్వర్యంలో అగనంపూడి ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంలా ఆటోనగర్ రహదారులు

- సుమారు రూ.25 కోట్లతో నిర్మాణం
- వాహనచోదకులు, స్థానికుల హర్షం



ఆటోనగర్ ఎస్ఆర్ఎంటీ నుంచి కొనసాగుతున్న రోడ్డు



ఆటోనగర్ ఏ బ్లాక్‌లో పూర్తయిన రోడ్డు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లో రహదారులు మెరుస్తున్నాయి. ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతం సుమారు 15 వందల ఎకరాల్లో 1200 పరిశ్రమలతో ఏ, బీ, సీ, డీ, డీ ఎక్స్‌పాన్షన్, ఈ, ఎఫ్, జీ, అపెరల్ పార్క్, పెదగంట్యాడ బ్లాకుల్లో విస్తరించి ఉంది. కొద్ది సంవత్సరాలుగా రహదారులు గోతులమయమై, ప్రమాదకరంగా మారాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు హడలిపోయేవారు. గోతులు తేలిన రోడ్లలో ప్రమాదాలకు గురై ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ఆటోనగర్ ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు) నిర్వహించిన కమిటీ సమావేశంలో తీర్మానించి, సుమారు రూ.25 కోట్ల వ్యయంతో ఆటోనగర్‌లోని అన్నీ బ్లాకుల్లో రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. ఇందులో ప్రస్తుతం బీ – బ్లాక్‌లో 80 శాతం కొత్త రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పలు బ్లాకుల్లో రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ, కల్వర్టుల వంటి అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నామని రఘు తెలిపారు.



విశాఖ వైర్స్ అండ్ రోప్స్ నుంచి వేసిన కొత్త రోడ్డు

పక్కాగా నిర్మాణ పనులు

ఆటోనగర్‌లోని అన్ని బ్లాకుల్లో రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నాణ్యత విషయంలో రాజీ పడకుండా, పక్కాగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆటోనగర్ బీ బ్లాక్‌లో చాలావరకు కొత్త రోడ్లు పూర్తయ్యాయి.

– కె.సూర్యనారాయణ, ఆటోనగర్ ఐలా కమిషనర్

రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం

ఐలా కమిటీలో ప్రధానాంశంగా రోడ్ల సమస్యే చర్చకు వచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుని రోడ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టాం. అందరి సహకారంతో కొత్త రోడ్ల నిర్మాణాలను చేపట్టాం.

–కె.సత్యనారాయణ రెడ్డి, ఆటోనగర్ ఐలా చైర్మన్

జాతీయ స్థాయి అవార్డు గ్రహీతకు అభినందన



అవార్డు గ్రహీతను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం శ్రీనివాసరావు

ఉక్కునగరం: ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబీకులు వివిధ కళల్లో, క్రీడల్లో అవార్డులు సాధించడం ప్లాంట్‌కు గర్వకారణమని స్టీల్‌ప్లాంట్ హెచ్ ఆర్ చీఫ్ జనరల్ మేనేజర్ కె. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక డీపాల్ పాఠశాల నాలుగో తరగతి విద్యార్థిని సేవిత ఇటీవల విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచి బాలచిత్ర కళా అవార్డును సాధించింది. ఈ సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో సీజీఎం శ్రీనివాస్ అవార్డు గ్రహీతను అభినందించారు. సేవిత తండ్రి ఆర్. తిరుపతి నాయక్ స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ ఉద్యోగి కాగా, తల్లి కల్పన ట్రాన్స్‌కోలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

కార్మికులకు నూతన వేతనాలు చెల్లించాలి



ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే నూతన వేతనాలు చెల్లించాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. డిమాండ్లు పరిష్కరించాలంటూ అక్కడ బైఠాయించారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ సెయిల్‌లో కార్మికులకు వేతనాలు అమలు చేసి ఏడాదిన్నర అవుతున్నా ఇక్కడ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించాల్సిన యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. పూర్తి సామర్థ్యంతో నడిస్తే కార్మికులు పూర్తి ఉత్పత్తి సాధించి చూపుతారన్నారు. ప్రైవేటీకరణ పూర్తిగా ఉపసంహరించాలన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్) మహంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.టి.దాస్, డి.వి.రమణారెడ్డి, సన్యాసిరావు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలు అప్రజాస్వామికం'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

పెదగంట్యాడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అప్రజాస్వామికమని సీపీఎం, సీపీఐ నాయకులు అన్నారు. మోదీ విధానాలు దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. గంగవరం పోర్టు వంతెన సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. అనంతరం బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, వై.శ్రీనివాసరావు, జి.ఆనంద్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన



యూజర్ చార్జీలను స్వీకరిస్తున్న జెడ్సీ సింహాచలం తదితరులు

గాజువాక : జీవీఎంసీ 67వ వార్డు జోగవానిపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై జీవీఎంసీ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇళ్లలో చెత్తను రోడ్లపై వేయవద్దని సూచించారు. తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకర చెత్తగా విభజించి ఇళ్లవద్దకు వస్తున్న క్లాప్ వాహనాలకు అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా యూజర్ చార్జీలను చెల్లించాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాలకు ప్రాధాన్యం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 70వ వార్డు ఎల్‌వీ నగర్‌లో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు వారికి వర్తించిన సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎక్కడా పేదలకు అన్యాయం జరగకుండా పరిపాలన సాగిస్తున్నారన్నారు. గాజువాకలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ఎప్పుడు తలుపు తట్టినా మీ ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో స్థానికులు సమస్యలు తెలియజేయగా అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్ ఉరుకూటి చందు, ఉరుకూటి అప్పారావు, సూరిబాబు, వార్డు సచివాలయ కన్వీనర్లు, కార్యదర్శులు, గృహసారథులు, వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నడిచి వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి బైక్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. వడ్లపూడి వాసి డి.శ్రీనివాసరాజు (44) స్టీల్‌ప్లాంట్ బీఎఫ్ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19న ఉదయం ఆయన తన కుమారుడు, స్నేహితునితో స్టీల్‌ప్లాంట్ ఆర్చి నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకు మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా ఆర్చి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా బైక్‌తో ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయారు. ఈ సంఘటనలతో శ్రీనివాసరాజుకు నుదుట, రెండు మోకాళ్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మృతుడు కుజూర్

ఉక్కునగరం: కూర్మన్నపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్ వెళ్లే ప్రధాన రహదారిలోని చైతన్య జూనియర్ కళాశాల సమీపంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి. స్టీల్‌ప్లాంట్ అధికారి కుమారుడు అనురాగ్ ఫెడరిక్ కుజూర్ (24) తన స్నేహితుడు పుష్పంకిత్ హోరో (25) బైక్‌పై వెనుక కూర్చుని వస్తుండగా కళాశాల సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో వెనుక కూర్చున్న కుజూర్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం షీలానగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డెయిరీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి 100 నుంచి 200 మంది అర్జీదారులు వస్తారని, వారికి భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కూడా చలివేంద్రం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విశాఖ డెయిరీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఎస్‌కేఎల్ రావు, విశాఖ డెయిరీ మార్కెటింగ్ మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు కుటుంబాలకు నిత్యావసర సరకులు



సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అగనంపూడి నిర్వాసితకాలనీ డొంకాడ, చట్టివానిపాలెం, లంకెలపాలెం ప్రాంతాలకు చెందిన ముగ్గురు రోడ్డు ప్రమాదాల్లో మరణించడంతో ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ట్రస్ట్ ముందుకు వచ్చింది. గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.స్వామి ద్వారా మూడు కుటుంబాలకు బియ్యం, పప్పులు, నూనెలు, చింతపండు, ఇతర నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

'కార్మికులకు అన్యాయం చేస్తే మూల్యం తప్పదు'



798వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని క్యాబినెట్ సమావేశంలో ప్రకటన చేసేవరకు ఉద్యమం విరమించేది లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. సంస్థకు సొంత గనులు కేటాయించి, ఉత్పత్తి పునరుద్ధరిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే దీక్షలు 798వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఉక్కు కార్మికులు పాల్గొని «విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు» అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలను హీనంగా చూడడం ఒక్క బీజేపీ ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు. కార్మిక లోకానికి అన్యాయం చేస్తే బీజేపీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

70వ వార్డులో ముగిసిన కార్యక్రమం



సర్వే పుస్తకాలను దేవన్‌రెడ్డికి అందజేస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: 'జగనన్నే మా భవిష్యత్తు, నువ్వే మా నమ్మకం జగన్' కార్యక్రమాన్ని 70వ వార్డులో విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి కేక్ కట్ చేసి, వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందును అభినందించారు. వార్డులోని 3,915 ఇళ్లకు వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం వివరాలను తెలియజేయడం హర్షణీయమన్నారు. ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రజలు జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, కృష్ణ, అచ్చిబాబు, కొణతాల రాము, భూషణం, బాబులు నాయుడు, అప్పలరాజు, భద్రం, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: ఉక్కు కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయడంలో గత గుర్తింపు యూనియన్ సీఐటీయూ, ప్రస్తుత గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ పూర్తిగా విఫలం అయ్యాయని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ విమర్శించారు. యూనియన్ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సం. 2021 అక్టోబర్‌లో ఎన్‌జేసీఎస్‌లో ఒప్పందం జరిగిందన్నారు. సెయిల్‌లో అప్పటి నుంచి అమలు చేయగా, అప్పటి యూనియన్ సీఐటీయూ యాజమాన్యంపై ఒత్తిడి తేవడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. గెలిస్తే వెంటనే వేతన ఒప్పందం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచిన ఏఐటీయూసీ ఏడాదైనా చేసిందేమీ లేదన్నారు. బీఎఫ్–3ను ఆపివేసినా కార్మికులు బీఎఫ్–1, బీఎఫ్–2ల్లో 110 శాతం సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తున్నారన్నారు. యాజమాన్యం జాప్యం చేయకుండా వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నీరుకొండ రామచంద్రరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో బి. మురళీరాజు, కారు రమణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బైబై వైజాగ్



లొకేషన్‌లో విక్టరీ వెంకటేష్

కొమ్మాది: ప్రముఖ కథానాయకుడు విక్టరీ వెంకటేష్ హైదరాబాద్‌కు పయనమయ్యారు. పది రోజుల నుంచి ఉక్కునగరంలో జరుగుతున్న సైంధవ్ సినిమా షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం వరకు షూటింగ్‌లో పాల్గొని ఆయన హైదరాబాద్ పయనమయ్యారు. రెండు రోజుల తరువాత భీమిలి లేదా కాకినాడ ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణ ఉండనున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి.

వెంకటేష్‌ను కలిసిన అభిమానులు

సైంధవ్ సినిమా చిత్రీకరణలో భాగంగా నగరంలో ఉంటున్న విక్టరీ వెంకటేష్‌ను విశాఖ సిటీ వైడ్ డీవీఆర్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ అర్జి శంకర్రావు, జిల్లా ప్రెసిడెంట్ పిళ్లా శ్రీను కలిశారు. సైంధవ్ సినిమా సూపర్ హిట్ కావాలని ఆకాంక్షించారు.

చందనోత్సవ భక్తులకు సదుపాయాలు కల్పించాలి

- అధికారులను ఆదేశించిన జీవీఎంసీ కమిషనర్
- సింహాచలం కొండ దిగువ ప్రాంతాల పరిశీలన



సింహాచలం కొండదిగువ పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

సింహాచలం : ఈనెల 23న జరిగే చందనోత్సవం రోజు వచ్చే భక్తులకు తాగునీరు, ఓఆర్ఎస్ ద్రవం సమృద్ధిగా అందించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. సింహాచలం కొండ దిగువ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి వేలాదిగా భక్తులు వస్తారని, ఎండలు ఎక్కువగా ఉన్నందున జనసంచారం ఉన్న ప్రతిచోట తాగునీరు అందేలా చూడాలన్నారు. అలాగే భక్తుల కోసం పార్కింగ్ ప్రదేశాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు ఉండాలని సూచించారు. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ఎక్కడికక్కడ ప్రాంతాలను తెలిపే సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు దాతలు అందించే ఉచిత ప్రసాద వితరణ వద్ద ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం లేకుండా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పెనాల్టీల నుంచి ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి



బ్యాంకు చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: బ్యాంకులు పెనాల్టీలు, చార్జీల నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల కార్యాచరణ సమితి (అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన జరిగింది. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట జరిగిన ప్రదర్శనలో జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ బ్యాంకులు విధించే పెనాల్టీల వల్ల ఉద్యోగుల సిబిల్ స్కోరు తగ్గిపోతుందని, దీని నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి, అదనపు భారాన్ని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్, కోశాధికారి రవిశంకర్, జేఏసీ కో చైర్మన్ నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, ఉద్యోగులు, పెన్షనర్లు హాజరయ్యారు. అనంతరం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.